01ATP28FFF.qxd:01ATP28FFF.qxd 01/01/01 6:59 AM Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 29 ఆగస్టు 2022 పేజీలు : 04


# ఫోన్ లిఫ్ట్ చేయరూ...ఆఫీసులోనూ ఉండరు...!

- సీట్ల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అనేక సందేహాలు
- సందేహాలు నివృత్తి కోసం డీసీవో ఆఫీస్ వద్ద తల్లిదండ్రుల పడిగాపులు
- ఇదీ ఏపి రాష్ట్ర డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల డీసీవో తీరు



ఏపి రాష్ట్ర డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

ఆయన ఒక జిల్లా అధికారి. ఆయన పరిధిలో రెసిడెన్సియల్ స్కూల్స్ వున్నాయి. ఆ స్కూల్స్‌లో సీట్లు కోసం, ఇతర విషయాలపై అనేక సందేహాలు నివృత్తి చేసుకోవడానికి ఫోన్ చేస్తే ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తుంది. కనీసం ఆఫీస్‌లోనైనా అందుబాటులో ఉంటారెమోనని అక్కడికి వెళ్ళితే అక్కడ ఉండటం లేదు. దీంతో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆయన కోసం ఆఫీస్ వద్ద గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ (డిసివో)గా బాలాజి నాయక్ దాదాపు రెండు సంవత్సరాల క్రితం జిల్లాకు వచ్చారు. ఈయనకు ప్రభుత్వం ఒక ఫోన్ నెం: 9949354106 ఇచ్చింది. ఈయన పరిధిలోకి ఉమ్మడి అనంతపురం జిల్లాలో డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు 16 వున్నాయి. ఈ విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి ఎడాది 5వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష జరగనుంది. అందులో ఉత్తర్ణత సాధించిన విద్యార్థులకు మాత్రమే సీట్లు కేటాయించాలని ప్రభుత్వ నిబంధన వుంది. అయితే తమ విద్యార్థులకు సీటు రాలేదని పలువురు తల్లిదండ్రులు, ఒక స్కూల్లో నుంచి ఇంకో స్కూల్లోకి తమ పిల్లల బదిలీ కావడానికి నిబంధనల ప్రకారంగా ఏ విధంగా ముందుకు వెళ్ళాలో తెలుసుకోవడానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు డీసీవోకు ఫోన్ చేస్తుంటారు. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఆఫీస్‌లోనైనా ఉంటారనే ఆశతో ఎంతో దూరం నుంచి చార్జీలు పెట్టుకొని అనంతపురం వచ్చి ఆఫీస్ ఎక్కడ వుందో తెలుసుకొని వస్తున్నారు. కానీ ఆయన మాత్రం ఆఫీస్‌లో ఉండటం లేదని, కనీసం ఫోన్ చేద్దామంటే ఒక సారి స్విఛ్ ఆఫ్ అని వస్తుందని, ఇంకో సారి ఫోన్ రింగ్ అవుతున్నప్పటికీ ఆయన ఫోన్ లిఫ్ట్ చేయరని, ఈ పరిస్థితి ఈయన జిల్లాకు వచ్చినప్పటి నుంచేనని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డీసీవో కోసం ఆఫీస్‌కు వస్తే అక్కడ పనిచేస్తే క్రింద స్థాయి సిబ్బంది డీసీవో సారు లేరని, క్యాంప్‌కు వెళ్ళారని, ఎప్పుడోస్తారో తెలియదని, మీరు రేపు రండి అని చెబుతున్నారు. అలాగని మరుసటి రోజు వస్తే ఆరోజు కూడా సిబ్బంది అదే విధంగానే చెబుతున్నారు. ఇలా రోజుల తరబడి డీసీవో కోసం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆయన జిల్లా స్థాయి అధికారి కావడంతో తన ఫోన్‌ను ఎప్పుడూ స్విఛ్ ఆన్‌లో పెట్టుకోవాలి. స్విఛ్ ఆఫ్ చేయకూడదు. ఒక వేళ ఛార్జింగ్ అయిపోతే చార్జింగ్ పెట్టుకోవాలని, మీటింగ్‌లో ఉంటే ఆ తర్వాత అయినా తనకు ఎవ్వరు ఫోన్ చేశారో, దేని కోసం ఫోన్ చేశారో, ఏ సందర్భంలో ఫోన్ చేశారోనని మిస్డ్‌కాల్స్‌కు ఫోన్ చేసి వారి సమస్యలు, సందేహాలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, కానీ ఆయన ఆ విధంగా చేయడం లేదని, ఆయన ఫోన్ ఎప్పుడు పనిచేస్తుందో, ఆయన ఎప్పుడు ఆఫీస్‌కు వస్తారో ఆయనకే తెలుసునని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్కూల్ సీట్లు కోసం ఎక్కువ ఫోన్లు వస్తున్నాయని, సీట్లు ఖచ్చితంగా కావాలని కొందరు తమపై ఒత్తిడి చేస్తున్నారని, అందుకే తన ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తున్నట్లు ఆయనే స్వయంగా తన క్రింద స్థాయి సిబ్బందితో చెప్పినట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే ఆయన ఎలాంటి ఆలోచనతో పనిచేస్తున్నారో డీసీవో తీరుపై తాము పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలు దళిత , విద్యార్థి సంఘాలు నాయకులు వాపోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీసీవో ఫోన్ స్విఛ్ ఆఫ్ చేసుకోకుండా, కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలు దళిత, విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ అడిగేందుకు డీసీవోకు వార్త విలేఖరి ఫోన్ చేయడా ఆయన ఫోన్ స్విఛ్ ఆఫ్ అని వచ్చింది. ఆ తర్వాత డీసీవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రమణారెడ్డికి ఫోన్ చేయగా...సీట్లు కోసం ఫోన్లు ఎక్కువగా వస్తున్నాయని, అందుకోసమే ఫోన్ స్విఛ్ ఆఫ్ చేసి ఉంటారని, ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఫోన్ ఆన్‌లో వుంటుందని, ఆ తర్వాత కూడా ఫోన్లు వస్తుండటంతో స్విచ్ ఆఫ్ చేస్తారని, డీసీవో ఆఫీస్‌కు వస్తే అక్కడికి కూడా కొన్ని సంఘాల నాయకులు వచ్చి సీట్లు కావాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.

# అధిక వర్షంతో అతలాకుతలం..!

## దారులు ధ్వంసం.. వ్యక్తి గల్లంతు



**తాడిపత్రి, ప్రభాతవార్త**

నియోజకవర్గ వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. ఆదివారం కురిసిన ఎడతెరపిలేని వర్షాలకు యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లి పెన్నా సిమెంట్స్, గుడిపాడు వద్దనున్న సాగర్ సిమెంట్స్ కర్మాగారాలు అడుగున్నర లోతు నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. దీంతో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిపివేయడంతో సిమెంట్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కర్మాగారాల ఆవరణమంతా జలమయమైంది. నిట్టూరులోని ఆర్డీటీ కాలనీలో ఉన్న నివాసాల్లోకి వర్షపునీరు చొచ్చుకొని వచ్చింది. గ్రామానికి సమీపంలోనున్న పెద్ద వంక ఆక్రమణలకు గురికావడంతోనే ఇలా తమ కాలనీ నీటిలో మునిగిపోవాల్సి వచ్చిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

యాడికి మండలం కుందనకోట-చింతలాయపల్లి రోడ్డు మార్గం కోతకు గురవడంతో వాహనాలు వెళ్లలేక ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తాడిపత్రి మండలం కోమలి వాగులో తాడిపత్రి సుంకులమ్మ పాలెంకు చెందిన బాబు(34) అనే మెకానిక్ కొట్టుకొని పోయాడు. రెస్క్యూ బృందాలు ఎంతగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. శుక్ర, శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు తడిసి ముద్దవుతున్నాయి.



కోమలివద్ద గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న రెస్క్యూ బృందం



కూలిపోయిన యాడికి మండలం కుందనకోట రహదారి



బోయరెడ్డిపల్లి పెన్నా సిమెంట్స్ కర్మాగారంలోకి ప్రవేశించిన వర్షపు నీరు

# అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణే మా విధానం

- అరాచకాలే పరిటాల కుటుంబం నైజం
- మా కార్యకర్తలకు కష్టం వస్తే మే మే ముందుంటాం
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

**అనంతపురం సిటీ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణే మా నినాదమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి సహకారంతో తాము సాగునీటిని అందించడంతోపాటు ప్రజలకు మేలు చేకూర్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అయితే అందుకు భిన్నంగా పరిటాల కుటుంబం నియోజకవర్గంలో అశాంతి రేగేలా తమ ఉనికి చాటుకునేందుకు దౌర్జన్య కర కార్యక్రమాలకు పాల్పడుతోందని విమర్శించారు. అందులో భాగంగానే రాప్తాడు నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం చెన్నేకొత్తపల్లి ఉపసర్పంచును కిడ్నాప్ చేయించి హత్య చేయించే ప్రయత్నానికి తమ అనునాయులచేత పరిటాల కుటుంబం ప్రయత్నించిందని ఆరోపించారు. చెన్నేకొత్తపల్లి ఉప సర్పంచును కిడ్నాప్ చేసుకుని తీసుకెళ్తుండగా తమ సోదరుడు రాజశేఖర్‌రెడ్డి దృష్టికి స్థానికులు తీసుకొచ్చారని, వెంటనే ఆయన పోలీసులకు సమాచారం అందించగా రామగిరిలోటీడీపీ నేతల ధర్నాలో తాము ఉన్నామని వెళ్లేందుకు కొద్దిగా ఆలస్యం అవుతుందని తెలుపగా స్వయంగా తన సోదరుడు రాజశేఖర్‌రెడ్డి అక్కడికి వెళ్లి తమ నాయకుడిని కాపాడుకున్నారన్నారు. తమ పార్టీ నేతల జోలికి వస్తే ఉపేక్షించమని, వారిని కాపాడుకునేందుకు తామే ముందుంటామని ఆయన స్పష్టం చేశారు. పరిటాల కుటుంబం తొలి నుంచి దౌర్జన్యాలు, హత్యా కాండలతోనే రాజకీయంగామనుగడ సాగిస్తోందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా తమ కుటిల ప్రయత్నాలను అడ్డుకుంటున్నారన్న నెపంతో పోలీసులపై సైతం విమర్శలు, దౌర్జన్యాలకు సైతం పాల్పడుతున్నారని, పోలీసులు లేకుండా ఇంటి నుంచి బయటికి అడుగు వేయలేని పరిటాల కుటుంబీకులు పోలీసులపై ఏ విధంగా విమర్శలు చేస్తారని ఆయన విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తేపోలీసులు ఉపేక్షించరని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా పరిటాల కుటుంబీకులు తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు.

# పట్టపగలే రెచ్చిపోయిన చైన్ స్నాచర్స్

- బంగారు గొలుసు లాక్కెల్లిన దుండగులు
- స్పందించిన పోలీసు అధికారులు - అనుమానితుల గుర్తింపు



ఇద్దరిని అనుమానితులుగా పోలీసుల గుర్తింపు

**అనంతపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త బ్యూరో**

పట్టపగలే చైన్‌స్నాకర్స్ రెచ్చిపోయి ఒక అపార్ట్‌మెంట్ ఆవరణంలోకి దూరి మహిళమెడలోని బంగారు గొలుసును లాక్కెల్లిన సంఘటన అనంతపురం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బంగారు గొలుసు లాక్కెల్లేందుకు దుండగుడు గట్టిగా యత్నించినపుడు ఆ మహిళ గట్టిగా ప్రతిఘటించినప్పటికీ చివరికి ఆ దుండగుడు ఆ మహిళను తోసివేసి గొలుసును లాక్కెల్లాడు. పక్కా పథకం ప్రకారం చైన్‌స్నాకర్ స్ ఈ దోపిడికి పాల్పడినట్లు అర్థం అవుతోంది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో మహారాజ అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్ నెంబర్ 202లో ఎ.బ్రహ్మానందరెడ్డి నివాసం ఉంటున్నాడు. పెద్దవడుగూరు మండలం కదినగుట్టపల్లికి చెందిన ఎ.బ్రహ్మానందరెడ్డి అనంతపురంలో ఒక సినిమాహాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ మహారాజ అపార్ట్‌మెంట్‌లోని 202లో నివాసం ఉంటున్నాడు. ఎ.బ్రహ్మానందరెడ్డి భార్య అంకిరెడ్డి గారి ప్రమీళ మెడలో నుంచే చైన్‌స్నాకర్స్ బంగారు గొలుసును లాక్కెల్లారు. ఆదివారం ఉదయమే తన భర్త బ్రహ్మానందరెడ్డితో ప్రమీళ ద్విచక్ర వాహనంపై అపార్ట్‌మెంట్ నుంచి బయటికి వెళ్లింది. పని ముగించుకుని మళ్లీ అపార్ట్‌మెంట్ దగ్గరకు వచ్చి తన భార్య ప్రమీళను అపార్ట్‌మెంట్ వద్ద విడిచిపెట్టి బ్రహ్మానందరెడ్డి బయటికి వెళ్లిపోయాడు. అదే సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తం ప్రమీళ అనే మహిళ అపార్ట్‌మెంట్‌లోకి వస్తున్న సమయంలో లిఫ్ట్ దగ్గరకు వచ్చేలోపు వెనుకవైపు నుంచి పరిగెత్తుకు వచ్చి బంగారు గొలుసును లాగేందుకు యత్నించాడు. ఆ సమయంలో ప్రమీళ ఆ దుండగులతో కొద్ది సేపు ప్రతిగటించింది. చివరకు తాళిబొట్టుతో సహా 3.50 తులాల బంగారు గొలుసును లాక్కుని అపార్ట్‌మెంట్ నుంచి బయటికి పారిపోయారు. అప్పటికే పల్సర్ బండిలో స్టార్ట్ చేసుకుని సిద్దంగా ఉన్న ఒక యువకుడి బండిలో పారిపోయారు. ఆ ఇద్దరు శ్రీకంఠం సర్కిల్ వైపు పరారయ్యారు. ఆ మహిళతోపాటు మరో ఇద్దరు యువకులు వెంబడించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ సంఘటన జరిగిన వెంటనే బాధిత ప్రమీళ కుటుంబ సభ్యులు అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ వారు 3 ట్రౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే 3 టౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ సి.వెంకటేశ్వర్లు, తదితర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి గాలింపుచర్యలు చేపట్టారు. అపార్ట్‌మెంట్‌లోని సిసి కెమెరాలతోపాటు చుట్టుపక్కల ఉన్న బ్యాంకుల సిసి కెమెరాలను కూడా పోలీసు అధికారులు పరిశీలించి చైన్‌స్నాకర్స్ ఫోటోలను అనుమానితులుగా గుర్తించారు. వారి ఆచూకీ కోసం అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఈ చైన్‌స్నాకర్స్ ఎవరై ఉంటారని ఆరా తీసే పనిలో పోలీసులు ఉన్నారు. ఈ సంఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపిసి 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టపగలే అనంతపురం నడిబొడ్డున ఉన్న శ్రీనివాస్‌నగర్‌లో చైన్‌స్నాకర్స్ తెగబడి మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని చర్చనీయాంశంగా మారింది. జనం రద్దీగా ఉండే ప్రాంతంలోనే ఈ సంఘటన జరగడం బాధితురాలు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇలాంటి చైన్‌స్నాకర్స్‌ను పట్టుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున నిఘా చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇలాంటి చైన్‌స్నాకర్స్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా అనంతపురం నగరంలోని ప్రధాన కూడళ్లతోపాటు వీధుల్లో కూడా సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు పోలీస్‌శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలి. అనంతపురం నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. శివారు ప్రాంతాల్లో కాలనీలు పెరిగిపోతున్నాయి. కాలనీల్లో ఎవరు కొత్తవారో.. ఎవరు చైన్‌స్నాకర్స్, ఎవరు ముఠా కక్ష దారులు తెలుసుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇందులో భాగంగా శివారు కాలనీలపైన నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

## ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా

# అంగరంగ వైభవంగా జరిగిన రాష్ట్రస్థాయి రోల్‌బాల్ క్రీడ







**అనంతపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త బ్యూరో**

నగర శివారులోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా రాష్ట్రస్థాయి రోల్ బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో 21 జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన రాష్ట్ర రోల్‌బాల్ పోటీల్లో 252 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల అధినేత కె.చిరంజీవిరెడ్డి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రోల్‌బాల్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.ప్రసాత్, సెక్రెటరీ అనిల్‌కుమార్‌రెడ్డి, రోల్ బాల్ ఇంటర్నేషనల్ ప్లేయర్, మణికంఠ, టెక్నికల్ బాడీ నెంబర్ వి.జి.ప్రేమ్నాద్, సంతోష్, ఒక్కంతగా జరిగిన తిరుపతి డిస్టిక్ చిత్తూరు డిస్టిక్ హేమ పోరాడుతూ అందరినీ మైమరిపించిన ఈ రెండు జిల్లాలు కాంస్య పథకం సాధించిన తిరుపతి జిల్లా, స్వర్ణం సాధించిన నెల్లూరు డిస్టిక్ట్. అనంతపురం డిస్టిక్ రజిత పతకం సాధించారు. బాలికల విభాగంలో మొదటి స్థానం విశాఖపట్నం, రెండో స్థానం ఎన్టీఆర్ జిల్లా, మూడో స్థానం తిరుపతి జిల్లాలు నిలిచాయి.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- ఓ ఎద్దు చావు - ఎన్నిసార్లు మొరపెట్టినా పట్టించుకోని వైనం
- ఇక తరువాయి.. మనుషుల వంతేమో..!



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న చోటు



ప్రమాదంలో మృతి చెందిన ఎద్దు

**శెట్టూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త**

ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు ప్రమాదం ముంచి ఉందని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మొరపెట్టుకుంటున్నా అధికారుల్లో ఇసుమంత చలనం కూడా లేదని చిన్నంపల్లి గ్రామం ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల్లో చలనం రావాలంటే మనుషులు బలి కావాల్సిందేనా..!? అంటూ రైతులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శెట్టూరు మండల పరిధిలోని చిన్నంపల్లి గ్రామంలో ఎప్పుడూ బాటసారులు పశువులు తిరుగుతున్న రోడ్డు పక్కనే గ్రామానికి విద్యుత్ సప్లై అందించే ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఉంచారు. దీని వలన కాస్త చినుకు పడితే చాలు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ భూమిలోకి షాక్ తగులుతుంది. దీని వల్ల ఎన్నో సార్లు మేకలు, గొర్రెలు ఈ రోజు మద్దిపాటి శ్రీనివాసులు అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై చనిపోవడం జరిగింది. ఎద్దు చనిపోవడంతో రైతుకు తీరని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలుకే రైతుకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోయి చేసిన అప్పులు తీరక ఆవేదనకు గురవుతుంటే ఇలా నిత్యం విద్యుత్‌షాక్‌కు గురై వ్యవసాయానికి రైతన్నకు వెన్నముఖలాంటి ఎద్దులు చనిపోతు ఉంటే వ్యవసాయం చేసుకొనుటకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చమని విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత వరకు పశువులకు మాత్రమే విద్యుత్ షాక్ గురైచపోయాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడి ట్రాన్స్‌ఫార్మర్ సురక్షితమైన స్థానానికి మార్చాలని గ్రామస్తులు వాపోయారు.

# చేతికందే.. ఎత్తులో ప్రమాదం

**శెట్టూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త**

అసలే వానాకాలం నేలంతా చిత్తడి చిత్తడిగా ఉంటోంది. ఇలాంటి సమయంలోనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాద అంచుల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు తీగలను సరి చేస్తే భాగుంటుంది. లేదంటే ఏదో ఒక ప్రమాదం జరిగిన తర్వాత ఆ సమయంలో ఏ ఉడతపైనో.. నెపం నెట్టి వేస్తారు. లేదా కరెంటు తీగలు లేదా గాలి, వానపైనో నెట్టేస్తారు. అదే ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని ప్రజల నుంచి వచ్చిన వెంటనే సరిచేస్తే బాగుటుందని ప్రజలు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా ప్రమాదం అంచున విద్యుత్ స్తంభాలు అనేకం ఉన్నా కూడా వాటిని మార్చేందుకు అధికారులు ఉత్సాహం చూపకపోవడంచాలా దురదృష్టకరం లక్ష్మంపల్లి గ్రామంలో ప్రధాన రహదారి గుండా విద్యుత్ వైర్లు కిందకి ఉండి వాహనాలు వెళ్లడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇదే గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర 8 సంవత్సరాల చిన్నారి ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడం కూడా జరిగింది. దీని గురించి పలు మార్లు అధికారులకు తెలియజేసినా కూడా ఎటువంటి స్పందన లేక పోవడం చాలా దురదృష్టకరం ఇప్పటికైనా విద్యుత్ అధికారులు మేల్కొని ఇక ఎన్నటికీ మూగ జీవాలకుకానీ, మనుషులకుగానీ ఎటువంటి అపాయం లేకుండా సమస్యలను పరిష్కరించ వలసింగా ప్రజలు కోరుతున్నారు.

# తిరుపతి వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

**విడపనకల్లు, ఆగస్టు 28 ( ప్రభాతవార్త)**



వెంకన్న సన్నిధిలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

కలియుగ దైవం అయినటువంటి తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిదిలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడారు. ప్రజలు, రైతులు సంతోషంగా ఉండాలని దైవ సన్నిదిలో శ్రీ వెంకటేస్వామిని వేడుకున్నారు. ఎమ్మెల్సీ వెంట విడపనకల్లు మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డిలు ఉన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్న వితరణ



వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్, ఆగస్టు 28 ( ప్రభాతవార్త)**

రాయదుర్గం రామకృష్ణ వృద్ధాశ్రమంలో వృద్దులకు సిరిగేదొడ్డి నల్ల పొలయ్య గారి సన్న పాలయ్య , సన్న పాలయ్య గారి చిన్న లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మంచి రుచికరమైన భోజనాలను వృద్ధులకు వడ్డించి వితరణ చేశారు. ఈసందర్భంగా వృద్దులు వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిరిగే దొడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పెద్దలను స్మరించుకుని ఈరోజు వృద్దులకు అన్నం వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కుమారులు లక్ష్మయ్య,ఎస్. రామాంజినేయులు, సన్న పాలయ్య గారి కుమారులు పాలానాయక, పాలయ్య, రేవన్న, వీరితోపాటు ఛేంజ్ ఫర్ సొసైటి టీం సభ్యులు కెఎస్ దొడ్డి చంద్ర చంద్రశేఖర్, సిరిగేదొడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో 46.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

**బత్తలపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండలంలో ఆదివారం తెల్లవారుజామున 46.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు ఏఎస్ఓ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. శనివారం అర్ధరాత్రి ఈదురు గాలులతో ప్రారంభమైన వర్షం ఏకధాటిగా ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసింది. దీంతో చెక్‌డ్యాంలకు నీళ్లు చేరాయి. వాగులు ప్రవహించాయి. ఈ వర్షం రాకతో వేరుశనగకు మేలు జరుగుతుందని, భూగర్భజలాలు పెరిగి పంటల సాగుకు ఉపయోగకరమేనని రైతులు తెలిపారు. పోట్లమర్రి సమీపంలోని దూపులేటు వాగు రోడ్డుపై ప్రవహించి అప్పరాశ్చెరువులోకి నీరు చేరింది.



పోట్లమర్రి వద్ద రోడ్డుపై నీరు ప్రవహిస్తున్న దూపులేటువాగు

# అధిక వర్షాలతో రైతుకు నష్టం

- అందని ప్రభుత్వ సాయం



కుళ్లిపోయిన పుచ్చకాయలు చూపుతున్న రైతు చంద్రప్ప

**గుడిబండ, ఆగస్టు 28 ప్రభాతవార్త**

గుడిబండ మండలం వ్యాప్తంగా రైతులు సంప్రదాయ పంటను వీడి వాణిజ్య పంటలవైపు మళ్లుతున్న క్రమంలో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని తిమ్మళాపురం గ్రామంలో చంద్రప్ప అనే రైతు గత రెండేళ్లుగా పుచ్చకాయలు పంట సాగు చేస్తున్నారు. రెండు సంవత్సరాల నుంచి పంట చేతికందే సమయంలో అధిక వర్షాలతో పంట మొత్తం నీట మునిగి పుచ్చకాయలు కుళ్లిపోయి. ఈ సందర్భంగా రైతు చంద్రప్ప మాట్లాడుతూ.. రెండు పర్యాయాలు పుచ్చకాయ పంట వేశానని అధిక వర్షాలతో పంట మొత్తంనీట మునిగి దాదాపు 2 లక్షలు నష్టపోయానని తెలిపారు. సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా ఎలాంటి సహాయ సహకారాలు అందలేదని వాపోయారు. అదే విధంగా చిగతుర్పి గ్రామంలో తిప్పన్న అనే రైతు దాదాపు ఆరు పర్యాయాలు పుచ్చకాయ పంట సాగు చేసి నష్టపోతున్నానని ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందలేదని, ఏ అధికారికి సమాచారం అందించాలో తెలియక సతమతమవుతున్నామని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతు భరోసా అసిస్టెంట్ అధికారి రహీనాను వివరణ కోరగా గత ఏడాది సాగు చేసిన పుచ్చకాయలు పంటను ఈ క్రాప్ చేసి ప్రభుత్వానికి నివేదిక అందించామని మండలంలో ఇంత వరకు పుచ్చకాయలు సాగు చేసిన ఎవరికీ నష్ట పరిహారం రాలేదని తెలిపారు.

# వృద్దుడు దారుణ హత్య



హతుడిని పరిశీలిస్తున్న సిఐ యుగంధర్, హతుడి ఇంటి వద్ద అన్వేషిస్తున్న డాగ్‌స్క్వాడ్

**బొమ్మనహాళ్, ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఉద్దేహాల్ గ్రామ సమీపంలోగల శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉండు తోటా చౌదరయ్య (70) శనివారం దారుణ హత్యకు గురైనట్లు రాయదుర్గం రూరల్ సిఐ యుగంధర్ తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు.. తోట చౌదరయ్య కొన్ని సంవత్సరాల నుంచి ఉద్దేహాల్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నివాసం ఉంటూ పొలం పనులు చేసుకునే వాడని, శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించి స్క్రూల్ డ్రైవర్‌తో తలపై రెండు చోట్ల, ఒక చోట గుండెపై బలంగా పొడిచినట్లు ఆనవాళ్లు ఉన్నాయని వారు తెలిపారు. హతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె. పెద్ద కుమారుడు సాంబయ్య గతంలో అనారోగ్యంతో మృతి చెందాడని, చిన్నకుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, హతుడి భార్య కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఒంటరిగా నివాసం ఉన్నట్లు వారు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కూతురు కొడుకు సిద్దార్థ టిఫన్ తీసుకుని ఇంటిలోకి ప్రవేశించడంతో రక్త మడుగులో పడి ఉన్న తాతను చూసి ఒక్కసారి ఉలిక్కి పడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారన్నారు. పోలీసులు హతుడి వద్దకు చేరి వేలి ముద్రలు, డాగ్‌స్క్వాడ్‌ను పిలిచి విచారణ జరపగా నేరస్తులు హతుడి గృహానికి సమీపంలో పొలంలో మద్యం సేవించి మద్యం బాటిళ్లు వదిలి వెళ్లినట్లు డాగ్ స్క్వాడ్ ద్వారా తెలిసిందన్నారు.. ఈ రెండు ఆదారాలతో కుటుంబ సబ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని బళ్లారి నిమ్స్‌కు పిఎం కోసం తరలించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. పిఎం అనంతరం శవాన్ని బంధువలకు అప్పగిస్తామని, కేసు పూర్వపరాలు పరిశీలించి నేరస్తులను త్వరలో పట్టుకుంటామని సిఐ యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జమేదార్లు శివారెడ్డి, హనుమంతనాయక్, సురేష్, కానిస్టేబుళ్లు రాజకుళ్లాయప్ప, రుద్ర, నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రబాబు ధమన కాండకు నేటికి 23 ఏళ్లు

- చరిత్రలో చెరిగిపోని నెత్తుటి జ్ఞాపకం
- వ్యవసాయం దండగన్న చంద్రబాబు
- రాష్ట్ర వైసీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**రాయదుర్గంటౌన్ ఆగస్టు 28 ( ప్రభాతవార్త)**

రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులపై జలియన్వాలాబాగ్లో కాల్పులు జరిపిన విధంగానే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కూడా చరిత్రలో మహిరాబాగ్‌లో రైతులపై వాటర్ కాన్లు ఉపయోగించడం, గుర్రాలతో తొక్కించడం, కాల్పులు జరిపించిన ధమకాండకు నేటికి 23 ఏళ్లు అయిందని ఈ సందర్భంగా రాయదుర్గం పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తూ రాష్ట్ర వైసీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు చరిత్రలో చెరిగిపోని నెత్తుటి జ్ఞాపకం మిగిల్చి, ఈనాడు రైతులకు ఏదో అన్యాయం జరిగిందని మొసలి కన్నీరు కారుస్తున్నాడని. వ్యవసాయం దండగ అంటూ వ్యవసాయాన్ని రైతులను పట్టించుకోకుండా గాలి వదిలేశాడన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు రైతుల సంక్షేమం కోసం ఒక హార్స్ పవర్ రూ. 50 రూపాయలు విద్యుత్ ఛార్జింగ్ విధిస్తే, దీన్ని చంద్రబాబునాయుడు 500 రూపాయలు వరకు పెంచి రైతులు పండించిన పంటలలో 90 శాతం విద్యుత్ చార్జీలు వసూలు చేసి రైతుల నడ్డి విరిచారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అందిస్తున్న సుపరిపాలన దేశంలో ఇతర రాష్ట్రాల సీఎంలు సైతం మెచ్చుకుంటూ వారి రాష్ట్రంలో ఆర్‌బికేలు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. చంద్రబాబునాయుడు కావాలనే దురుద్దేశ్యంతో రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బహిరాబాగ్‌లో జరిగిన సంఘటనను ప్రతి రైతు మర్చిపోకుండా ఉమ్మడిగా ఉంటూ వైసీపీ ప్రభుత్వం పట్ల నమ్మకం విశ్వాసంతో మెలగాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీకి 2024 ఎన్నికలు చివరి ఎన్నికని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి హోన్నె మల్లికార్జున , మాధవరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి రక్తగాయాలు

**అగళి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రామాపురం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ముగ్గురికి రక్తగాయాలయ్యాయి. రాగేనింగన పల్లి నుంచి ద్విచక్ర వాహనం-అగళి నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి కాళ్లు విరిగాయి. వృద్దునికి కూడా గాయపడ్డాడు. వీరిని మెరుగైన చికిత్స కోసం శిరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 వాహనం ద్వారా ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఆ ఒక్క అడుగు మాత్రమే..

# 30 ఏళ్ల కల నెలవేరడానికి



అగళి చెరువుకు చేరిన నీరు, సువర్ణముఖి నది నిండుగా ప్రవహిస్తున్న దృశ్యం

**అగళి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

30 ఏళ్ల నుంచి రైతుల కల నెరవేరడానికి ఒక్క అడుగు దూరంలో ఉంది. అగళి మండలంలోనే అతి పెద్ద చెరువు అయిన అగళి చెరువు నిండి 30 ఏళ్లు అయింది. ఆ చెరువుకు నీరు చేరే సువర్ణముఖి నది ఎగువ ప్రాంతంలో దాదాపు 38 చెరువులు, కుంటలు, అడ్డకట్టలు నిండాయి. సువర్ణముఖి నది కూడా నిండుగా ప్రవహిస్తోంది. అగళి చెరువు నిండటానికి ఒక్క అడుగు నీరు చేరితే నిండుతుంది. మూడు దశాబ్దాల రైతు కల నెరవేరాలంటే ఒక్క అడుగు దూరంమాత్రమే ఉంది. 24 గంటల్లో లేదా 48 గంటల్లో అగళి చెరువు నిండటానికి పుష్కలంగా సువర్ణముఖి నది నుంచి నీరు అగళి చెరువుకు నిండుతుంది. రైతుల కల నెరవేయడానికి ఎంతో సమయం పట్టదు. గంటల్లోనే రైతుల కల నెరవేరబోతోందని, అగళి చెరువు మరువ పారుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**అగళి, ఆగస్టు 28 ప్రభాతవార్త**



కృష్ణుని వేషధారణలో నృత్యం చేస్తున్న దృశ్యం

అగళి మండలంలో శ్రీకృష్ణుని అష్టమి వేడుకలను యాదవ సోదరులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో ముఖ్యంగా కృష్ణుని వేషధారణలో పిల్లణగోవి పట్టి నిల్చున్న దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. యాదవుల కుల వృత్తిలో భాగంగా కంబలిని ఎక్కువ మంది వారి బుజాన వేసుకుని దర్శన మిచ్చారు. ఈ కృష్ణాష్టమి వేడుకలకు మాజీ పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కృష్ణాష్టమి ఒక్క యాదవులకే కాదని, ప్రస్తుతం ఇది ప్రపంచ పండుగగా మారిందని అన్నారు. మండలంలోని మహిళలు కృష్ణునికి హారతి పట్టి అగళి పుర వీధుల గుండా హారతులతో ర్యాలీ నిర్వహించారు. డప్పులు వాయిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణున్ని వివిధ పూలతో అలంకరించి రథంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, మాజీ జడ్పిటిసి రామకృష్ణ యాదవ్, హనుమనపల్లి ఎంపిటిసి చంద్రప ్ప, నియోజకవర్గం తెలుగు యూత్ వైస్ ప్రెసిడెంట్ కెంచ యాదవ్, రెడ్డి, కృష్ణమూర్తి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సస్పెన్షన్ అనైతిక చర్య




సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్‌నాయకులు

**శ్రీసత్యసాయి జిల్లా , ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి:**

పెనుకొండ డివిజన్ పరిధిలో పరిగి ఉన్నత పాఠశాలకు చెందిన 5 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అనూతిక చర్య అని ఎపిటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండలోని రామబురుజు ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగిన ఎపిటిఎఫ్ పెనుకొండజోన్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్నదని, సరిగా పాఠాలు చెప్పలేని స్థితికి తీసుకువస్తున్నదన్నారు. మధ్యాహ్న భోజనంకు ఉపాధ్యాయులకు సంబంధం లేకున్నా, ఉన్నట్లు చూపి సస్పెండ్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నాణ్యమైన బియ్యం సరఫరా చేయకుండా ఎండిఎం ఏజెన్సీవారికి డబ్బులు ఇవ్వకుండా సరైన భోజనం వండడం లేదని, ఉపాధ్యాయులు నెపం పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే వారిని సస్పెండ్ ఎత్తివేయకపోతే పెద్దఎత్తున డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, తలమర్ల నరసింహులు, రఘునాథ్ రావు, రంగేష్‌కుమార్, రుద్రేష్, రామాంజినేయులు, సంజీవరాయుడు, ఎస్.ఎం.డి.యాకుబ్, అమీర్‌వలి, వెంకటేశులు, పి.జి.రఘునాథ్, ఎ.కిష్టప్ప, బి.రాఘవయ్య, టి.శివయ్య, పి.కేశప్ప, ఎన్.ఆంజనేయులు, రామాంజినేయులు తదితరలు పాల్గొన్నారు.

# శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గంను ఏర్పాటు చేసిన దృశ్యం

**పుట్టపర్తిరూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయిజిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ సమీపంలో గల ఓ ప్రైవేటు భవనం నందు ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమావేశంను ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు తలారి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అక్కులప్ప హాజరై మాట్లాడుతూ, జిల్లా నందు వివిధ శాఖలలో పని చేస్తున్న వాల్మీకులకు ఈ వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వాల్మీకి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే ఈ సంఘం పని చేస్తుందని, సిపిఎస్ రద్దుపై సెప్టెంబర్ 1న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇటీవల 15 ఆగస్టున 75వ స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకలలో ఉత్తమ అవార్డులు పొందిన రామ్మోహన్ (ఐకెపి), రాజ్యలక్ష్మి (పంచాయతీరాజ్)లను పూలమాలలు వేసి, శాలువలు కప్పి సత్కరించారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంను ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీసత్యసాయి వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా తలారి జయరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు రామ్మోహన్, సి.కిష్టప్ప, కె.గోపీనాథ్, ఎన్.వి.రమేష్‌బాబు, కె.రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.చంద్రమోహన్, కోశాధికారిగా కె.సాయినాథ్, గౌరవ అధ్యక్షులుగా ఓబులేసు, గౌరవ సలహాదారులుగా గంగాధర్, కార్యదర్శులుగా మారుతి ప్రసాద్, వెంకటరాముడు, రవిచంద్ర, ఎం.చంద్రశేఖర్, నరసింహులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలలో పని చేస్తున్న వాల్మీకి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# వైకాపా ప్రభుత్వానికి హిందూవుల పండుగలపై వివక్ష ఎందుకు

**మడకశిర ఆగస్టు 28 ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వం హిందువుల పండుగలపై వివక్ష చూపుతోందని బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పుడు వినాయకచవితి మండపాలపై ఆంక్షలు పెట్టడం వైకాపా ప్రభుత్వం వివక్షత చూపుతోందని అన్నారు. బిజెపి రాష్ట్ర పిలుపు మేరకు శ్రీసత్యసాయి జిల్లాలోని గణేష్ ఉత్సవాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలపై బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఎస్.చంద్రశేఖర్ స్పందించారు. గణేష్ ఉత్సవాలపై ఆంక్షలను జిల్లాలో ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గణేష్ మండపాల అనుమతి కోసం నాలుగు శాఖల వద్దకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. అదే ఇతర మతాల పండుగలపై ఇలాంటి ఆంక్షలు విధించగలరా అని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం హిందూ పండుగలపైనే వివక్ష చూపుతోందని అన్నారు. అధికారులు గణేష్ మండపాల నిర్వాహకులకు సహకరించాలని, అలాగే డిజే, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతులను ఇవ్వాలని ఆయన కోరారు. హిందువులు ఇతర మతాలకు వ్యతిరేకం కాదని ఎవరి సాంప్రాదాయాలు వారివని ఆయన అన్నారు. గణేష్ భక్తులు వినాయకచవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# వాల్మీకులపై దాడులను అరికట్టాలి:అనిల్‌కుమార్

**మడకశిర ఆగస్టు 28 ప్రభాతవార్త**



జి.టి.అనిల్‌కుమార్

అధికార ప్రభుత్వంలో రోజురోజుకి వాల్మీకుల మీద జరుగుతున్న దాడులు చూస్తుంటే పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని పిస్తోందని వాల్మీకి రాష్ట్ర కార్యదర్శి, వాల్మీకి బిసి సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోయ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలో వాల్మీకులపై రోజురోజుకు దాడులు అధికమవుతున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల సత్యసాయి జిల్లాలోని గోరంట్ల పట్టణంలోని వాల్మీకి ముద్దుబిడ్డ తేజస్వినిని అత్యంత పాశవికంగా దుర్మార్గులు హత్యచేస్తే దానిని ఆత్మహత్యగా చిత్రించేందుకు అవాస్తవాలను వెల్లడించారని ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. అది మరువక ముందే రాప్తాడు నియోజకవర్గంలో వాల్మీకి సామాజిక వర్గంనకు చెందిన మాజీ ఎంపిపి అమరేంద్రపై వైకాపా నాయకుడు రోడ్డుపై తరిమితూ కొడుతుంటే పట్టించుకొనే నాథులే కరువయ్యారని ఇలా అయితే ఎలా అని ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. ఇలా జరుగుతున్న దాడులు చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అన్న అనుమానం కలుగుతోందన్నాడు. వాల్మీకులందరు ఎవరికి వారుగా ఉంటూ ఏమి పట్టనట్లుగా ఉంటే భవిష్యత్తులో వాల్మీకులకు ఎదుగుదల లేకుండా చేస్తారని ఓట్లు వేయడానికి బలవంతంగా లాక్కొనే ప్రయత్నాలు చేస్తారని హెచ్చరించారు. ఇప్పటికైనా వాల్మీకులందరు రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపై నిలబడి వాల్మీకులమైన మనము మనవారికి అండగా నిలచి వాల్మీకులపై జరిగే దాడులను అరికట్టేందుకు మనమందరం ముందుకు నడవాలని మనసారా కోరుకుంటున్నానని ఆయన కోరారు.

# ప్రజలకు అందుబాటులో యూనియన్ బ్యాంకు సేవలు



నూతన బ్యాంకు ప్రారంభిస్తున్న అధికారుల దృశ్యం



బ్యాంకు మేనేజర్‌గా బాధ్యతలు

**అమరాపురం, ఆగస్టు 28 ( ప్రభాతవార్త)**

మండల కేంద్రంలోని ఎంసీసీ మార్ట్ సమీపం నందు యూనియన్ బ్యాంకును జిల్లా రీజినల్ అధికారి సింహ చలం, అసిస్టెంట్ రీజినల్ అధికారులు అశ్వర్థ నాయక్ కేక్ కట్ చేసి నూతన బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన బ్యాంకు భవనం నందు పురోహితులతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా పరిధిలో 21వ యూనియన్ బ్యాంకు అమరాపురం నందు ఏర్పాటు చేసిన సందర్భంగా మేనేజర్‌గా రాజేష్, ఆఫీసర్‌గా కృష్ణకాంత్‌లు అధికారులు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీజినల్ బ్యాంకు అధికారులు సింహాచలం, అశ్వర్థనాయక్ లు మాట్లాడుతూ అమరాపురం మండల ప్రజలకు యూనియన్ బ్యాంకు సేవలు ఎల్లవేళలా అందించడానికి ముందుంటామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా వ్యాప్తంగా 38 పుట్టపర్తి జిల్లా వ్యాప్తంగా 21 యూనియన్ బ్యాంకులు ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ. 9 వేల కోట్లతో ప్రారంభమైన యూనియన్ బ్యాంకులు నేడు దాదాపు రూ. 24 వేల కోట్ల లావాదేవీలతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు, వ్యాపార వర్గాలకు మహిళా సంఘాలకు చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వ్యక్తులకు బ్యాంకు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని. బ్యాంకు పురోగతిని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బ్యాంకు ఖాతా ద్వారా వివిధ ఇన్సూరెన్స్ సౌకర్యం, రైతులకు, కార్మికులకు అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆ ఆవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యకు విద్యారుణాలు కేంద్ర ప్రభుత్వం అందించే ముద్రా రుణాలు, సీనియర్ సిటిజన్లకు బ్యాంకు ద్వారా అందించే సేవలను కూడా ఎల్ల వేళలా అందజేస్తామని మండల ప్రజలు యూనియన్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా వచ్చే సంక్షేమ పథకాలను కూడా అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిబ్బంది, మండల ప్రజలు మారుతి, నిరంజన్, ప్రకాష్, కెంచెప్ప, బూడేన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో భారీ వర్షం

- జలమయమైన కాలనీలు

**గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త**

గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. 4.5 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. వర్షం తాకిడితో పలు కాలనీలు జలమయమయ్యాయి. మెరుగైన పారిశుద్ధ ్య వ్యవస్థ లేక పోవడంతో వర్షం నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు కొంత మేర ఇబ్బందులుపడ్డారు. పట్టణానికి ప్రధాన నీటి వనరు అయిన సత్యసాయి ప్రాజెక్ట్ జలమయంకావడంతో నీటిసరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సమీపంలోని జెడ్‌వీరారెడ్డి కాలనీ బురదమయమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం రావడం పట్ల ఒకవైపు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూనే మరోవైపు నెలకొన్న ఇబ్బందుల పట్ల ఆవేదన వ్య క్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయ ఉద్యమ సారథి సింగరాజుకి ఘన నివాళులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఎపిటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ సమావేశం జిల్లా అధ్యక్షులు జి.వెంకటేషులు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని ఆంధ్రనాట నిర్మించి బ్రతకలేని బడిపంతులను పోరాటయోధులుగా తీర్చిదిద్ది విద్యా, ఉపాధ్యాయ రంగాల అంతస్తుని పెంచ డానికి అనేక పోరాటాలు, ఉద్యమాలను సింగరాజు రామకృష్ణయ్య నిర్మించి 1949 నుంచి 1992 వరకు 43 సంవత్సరాలపాటు ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శిగా 5 సార్లు ఎంఎల్‌సిగా ఎన్నికై శాసనమండలిలో విద్య, ఉపా ధ్యాయ రంగ సమస్యలతోపాటు ప్రజా సమస్యలను సైతం ప్రస్తావించి వాటి పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశారు. సింగరాజు 20వ వర్ధంతిని నిర్వ హిచంచి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా నివా ళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రా ష్ట్ర కార్యదర్శి బి.నర సిం హులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, రాష్ట్ర పూర్వ అధ్యక్షు లు మనోరథు, రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు జి.వెంకటేషులు, ప్రధాన కార్య దర్శి యస్. సిరాజుద్దీన్ గౌరవ అధ్యక్షులు డి.ప్రభాకర్, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బొమ్మ య్య, సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్‌వలి, నరేష్ కుమార్, వెంకట రమణ, నాయకులు పూర్ణ చం ద్రరావు, శ్రీనివాసులు, లక్ష్మీ నారాయ ణ, సాయప్ప, హనుమంతు, చిదంబర్‌రెడ్డి, భావనేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

## ఎస్కేయూలో నూతనంగా అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నియామకాలు

ఎస్కేయూ, ఆగస్టు 28 ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 7 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ నియామకాలు నిర్వహించారు. ఇందులో ఎగ్జామినేషన్, కంప్యూటర్ యూనిట్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ డిఓఇగా డా.శైలజా (ఎంబిఏ విభాగం), బికాం, బిబిఏ కోర్సులు డా.సిహెచ్.కృష్ణుడు (ఎంబిఏ విభాగం), బిఏ కోర్సు డా.బి.చంద్రమౌలిరెడ్డి (పొలిటికల్ సైన్స్ విభా గం), ఎంటెక్/బిటెక్/ఎంఫేస్/బి.ఫర్/బిఇడి/బి.పెడ్/డి.పెడ్ డా.ఎం.శ్రీవాణి (ఇంజినీరింగ్ విభాగం), బిఎస్సీ కోర్సు డా.సిఎం అనురాధ (బయోటెక్నాలజీ విభాగం), డిజిటలైజేషన్, ఎగ్జామినేషన్స్ రికార్డ్స్ డా.జి.విజయ్‌కుమార్ (ఇం జినీరింగ్ విభాగం), పిజి డా.పి.తిమ్మయ్య (ఎల క్ట్రానిక్స్ విభాగం), ఈ ఏడ గురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కింద బాధ్యతలను తీసుకున్నారు. పేప ర్ సెట్టింగ్, టైమ్‌టేబుల్‌ను అను సరించి ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేయ డం, సమా ధాన పత్రాలను పరీక్షా కేంద్రాల నుంచి తీసుకో వడం, సమాధాన పత్రాలకు కోడింగ్/డి కోడింగ్ చేయ డం, సమాధాన పత్రాల మూ ల్యాం కనం, పరీక్షా ఫలితాలను విడుదల చేయడం జరుగుతుంది.



అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్‌ను నియకం చేస్తున్న దృశ్యం

### తెలుగు భాషా బోధనోపకరణలు ఆవిష్కరణ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

గిడుగు వారి జయంతిని పుర స్కరించుకుని తెలుగు భాషా దినో త్సవం సందర్భంగా జిల్లా విద్యా శాఖాధికారిచే తెలుగు భాషా బోధ నోపకరణాలు ఆవిష్కరిం చడం జరిగింది. ఈ సందర్భంగా విద్యా శాఖాధికారి మాట్లాడుతూ.. ఆంగ్ల భాషా వ్యామోహంలోపడి అక్షరా లను, చిన్నచిన్న పదాలను కూడా గుర్తించలేని పరిస్థితుల్లో మన పిల్లలు ఉన్నా రన్నారు. కాలం గడిచే కొద్దీ భాషను కూడా మరచి పోతారేమో అన్న ఆందోళనను వ్యక్త పరిచారు. అలాంటి కొరతను కొంతమేరకైనా తీర్చడానికి తెలుగు భాషోపాధ్యాయుడుగా అక్షరాలు, గుణింతాలు, ద్విత్వ సంయు క్తాక్షరాలను సులభంగా గుర్తించడానికి ఈ భోధనోపకరణాలు ఉపయోగ పడుతాయని ఆనందరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌ఎటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల శివానందరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.ఆదిశేషయ్య, జి.వేణుగోపాల్, వెంక టేషులు, ఆదిమూర్తి, తిమ్మప్పనాయక్ పాల్గొన్నారు.



బోధనోపకరణములను ఆవిష్కరిస్తున్న దృశ్యం

### డివైఎఫ్ఐ జిల్లా మహాసభలు ప్రారంభం

అనంతపురం అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

యువజన రంగం (డివైఎఫ్ఐ) జిల్లా మహా సభ అనంతపురం నగరంలోని మెడికల్ రెప్స్ హాల్, హెచ్ఎల్‌సి కెనా ల్ దగ్గర ప్రారం భించారు. దీనికి డివై ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న హాజర య్యారు. దేశంలో 2 కోట్లుయు వతి, యువకులు సభ్యులుగల ఏకైక యువ జన సంఘం డివైఎఫ్ఐ అని డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. రాష్ట్ర ంలో ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలని, స్వతంత్రం కోసం జరిగిన పోరాటంలో అమ రులైన భగత్‌సింగ్ స్ఫూర్తితో రాబోయే రోజు ల్లో నిరుద్యోగులను కలుపుకుని ఉద్యోగాలు అండ్ ఉపాధి సాధించుకుంటామని తెలిపారు. స్థానిక వనరులను ఉపయోగించి, స్థానిక నిరుద్యోగులకు ప్రోత్స హించి, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని దేశ రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జి.రామన్న, ప్రభుత్వానికి కోరారు. స్థానిక పరిశ్రమలలో స్థాని కులకే 75 శాతం కోటా కింద ఉపాధి ఇవ్వాలని, అది అమలు చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ అనంతపురం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, కార్యదర్శిగా నరసింహ, కోశాధికారిగా నూరుల్లా, జిల్లా కమిటీ సభ్యులుగా రాజు, సురేంద్ర, చరణ్‌లను ఎన్నుకున్నారు.



డివైఎఫ్ఐ నాయకులు

### ఘనంగా విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.పె ద్దన్న అధ్యక్షతన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డు తూ.. వికలాంగుల హక్కుల కో సం మహాజన నేత బడుగు బల హీన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ 2007లో ఆగస్టు 28న విహెచ్‌పిఎస్ ఏర్పాటు చేసి వికలాంగుల కోసం అనేక పోరాటా లు చేసి వికలాంగులకు అండగా నలిచి అనేక విజయాలు సాధించారన్నారు.



విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పెద్దన్న

### సస్పెండ్ కాబడిన ఉద్యోగులు లక్ష్మణరావు, ఎండి నాగభూషణ్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి - ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు డా.హెచ్.రామచంద్ర అధ్యక్షతన జరిగిన కులసంఘాలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లా డు తూ.. అనంతపురంలోని విశ్వ విద్యాలయాల్లో రిజర్వేషన్ వర్గాల కు చెందిన ఉద్యోగులను అకారణంగా కేవలం ఆర్‌ఇఎఫ్ సంఘం లో చురుకుగా పాల్గొని ప్రశ్నిస్తున్నార అని సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వలగొండ రామకృష్ణ, లీగల్ సెల్ అధ్యక్షులు సాకే నరేష్, సీనియర్ బిసి నాయకులు ఎస్ఆర్ నాగభూషణ, జిల్లా గౌరవ అధ్యక్షులు కోటి మల్లేసు, మాధవరావు, పుట్లూరు సుధాకర్, ఎపిటిఎఫ్ నరసింహులు, అంపావతి గోవిందు, నాగభూషణగౌడ్, ఎ.గోవి ందు, పిడుగు శ్రీనివాసులు, కంబన్న విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం. రమేష్, ఎ ంహెచ్‌పిఎస్ సాకే రామతీర్థ, గోపాల్ సంజీవరాయుడు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఇఎఫ్ నాయకులు

### ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల విశ్వాసాన్ని కోల్పోకూడదు : రూట

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఇష్టంలేని పిఆర్సి ఇచ్చినందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరాశ, నిస్పృ హలతో రగిలిపోతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సిపిఎస్ రక్కసిని రదుద చేసి ఓపిఎస్ వరం అందిం చాల్సిపోయి కనీసం నిరసన చేసే హక్కుపై సైతం ప్రభుత్వం ఉక్కు పాదం మోపడం ఎంత మాత్రం మంచిది కాదని రాష్ట్ర ఉర్దు టీచర్స్ అసోషి యేషన్ రా ష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అబ్దుల్ వారిస్ సయ్యద్ ఇక్బాల్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.



అబ్దుల్ వారిస్, సయ్యద్ ఇక్బాల్

## ఉమ్మడి సీనియారిటీ ప్రకారమే పోస్టులను భర్తీ చేయాలి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారి పోస్టులను ఉన్నట్టుండి నిన్నటి రోజున కేవలం ప్రభుత్వ యాజమాన్య ప్రధా నోపాధ్యాయులతో అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరామిరెడ్డి ఒక అత్య వసర ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ప్రభాత వార్తతో మాట్లాడుతూ.. 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు 2017లో సవరణ చేయబడ్డాయని, వాటిని జిఓ ఎంఎస్ నెం.82 తేదీ 4.07.2017న గాజెట్ ఆఫ్ ఇండియాలో తిరిగి ప్రచురించారని, అందులో ప్రభుత్వ ప్రధానో పాధ్యా యులు, జల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖా ధికారి పోస్టులను ప్రత్యేక క్యాడర్‌గా గుర్తిస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులు మూడవ షెడ్యూ ల్‌పై పోస్టులను జోనల్ క్యాడర్ పోస్టుగా గురిస్తూ జిఓ ఎంఎస్ నెంబర్ 72 తేది 23.9.2017న ఉత్తర్వులు వెలువడ్డాయని, వీటిపై కూడా ఇంకా గౌరవ ఉన్నత న్యాయస్థానంలో విచారణలో ఉన్నాయని ఈ పరిస్థితు ల్లో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారుల పోస్టులను తాత్కాలిక పద్ధతి లో నియమి ంచడంలో ప్రభుత్వం పక్షపాతవైఖరి అవలంభించడం భ్యాం కాదన్నారు.

### మాతృభాషను మృత భాష కానివ్వకండి - ఎస్ఎల్‌టిఎ నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

బోధనా భాషగా పండితులకు మాత్రమే పరిమితమైన తెలుగు భాషను సామాన్యులకు (పామరులకు) చేరువ చేసిన ఆధునిక భాష భగీరథులు, వ్యవహారిక భాషోద్యమ రూపశిల్పి గిడుగు రామమూర్తి పంతులు జయంతిని తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకోవడం తెలుగు జాతి అదృష్టమని ఎస్ఎల్‌టిఎ నాయకులు జిల్లా అధ్యక్షులు వై.ఆదిశేషయ్య పేర్కొన్నారు. మాతృభాషకు ప్రాధాన్యతనిచ్చే నూతన జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు చట్టంప్రకారం ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలోనే కొనసాగిం చాలన్నారు. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో ఆంగ్ల భాషను అందలమెక్కిస్తూ మాతృభాషకు మరణ శాసనం రాస్తున్నారన్నారు. భాష ఆధరణ కోల్పోతే తెలుగు, సంస్కృతి, తెలుగుజాతి కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు.

### ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిందే - సిపిఎస్ అమలు చేయాల్సిందే.. - ముందస్తు నోటీసులు, బైండోవర్ కేసులతో ఉద్యమాలు ఆపలేరు - ఎపి రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నల్లిపల్లి విజయ్‌భాస్కర్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ గతంలో ముఖ్య మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, పాత పెన్షన్ విధానాన్ని అమ లు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఓపిఎస్ అమలు సాధ్యం కాదని కేవలం జిపిఎస్ అమలు చేస్తామనడం రాష్ట్ర ఉద్యోగు లందరిని మోసం చేయడమే అన్నారు. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో ఇప్పటికే పాత పెన్షన్ అమలు సాధ్యం అయిందని, మరి ఆంధ్రప్రదేశ్‌లో ఓపిఎస్ అమలు సాధం కాదు అని ప్రభుత్వం చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిం చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

### జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టండి - జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి

అనంతపురం క్రైం, ఆగస్టు 28 ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాఆలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి సూచించారు. ఎన్‌హెచ్ఐ, ఆర్‌టిఎ అధికా రు లు కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. బ్లాక్ స్పా ట్స్ వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలి, జాతీయ రహదారులపై స్పీడ్ గన్స్‌తో వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి, జాతీయ రహదా రులపై వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్లకుండా రహదారులపై ఆగిన లేదా నిలిపి ఉన్న వాహనాలను తక్షణమే అక్కడి నుంచి పక్కకు తరలించడం చేయాలన్నారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు ఐదు నామినేషన్లు

అనంతపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త

నగరపాలక సంస్థ, అనంతపురం స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కోసం ఈ నెల 20న కమిషనర్ కె.భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సమయం ముగిసే సరికి మొత్తం ఐదు మంది సభ్యుల ఎన్నిక కోసం 5 మంది నామినేషన్లు వేయడం జరిగిందని నగర పాలక కార్యదర్శి ఒక ప్రకటనలో తెలియజేశారు. వార్డె నెంబర్ 43 నుంచి ఎ.ఇసాక్‌మదీనిబాషా, వార్డు8 నుంచి బి.సుమతి, 45 నుంచి టివి. చంద్రమోహన్‌రెడ్డి, 32 నుంచి కె.కమల్‌భూషణ్, 48 నుంచి మాల పాటి శ్రీనివాసులు నామినేషన్ వేసినట్లు తెలిపారు.

## విద్యుత్ ఉద్యమ అమరులకు ఘన నివాళులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

వామపక్ష పార్టీలైన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఎం, సిపిఐ, ఎస్‌యుసిఐ నాయకుల ఆధ్వర్యంలో గతంలో 22 ఏళ్ల క్రితం విద్యుత్ ఉద్యమంలో మరణించిన వారికి అనంతపురం క్లాక్ టవర్ వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబా బునాయుడు ప్రపంచ బ్యాంకు విధానాలను అనుసరించి 22 సంవత్సరాల క్రితం విద్యుత్ చార్జీలను పెంచినప్పుడు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయడం ఆందోళనలో భాగంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా బషీర్బాగులో జరిగినటువంటి కాల్పుల్లో ముగ్గురు యువకిషోరాలు అమరులు కావడం చాలా బాధాకరమన్నారు. ఆరోజుల్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ లీడర్ రాజశేఖర్‌రెడ్డి ఆ ఉద్యమానికిమద్దతు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఉద్యమంలో కలిసి రావడంతో చంద్రబాబు నాయుడు దిగి వచ్చి పెంచిన కరెంటు చార్జీలను ఉపసంహ రించుకోవడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఏ ప్రభుత్వం వచ్చినా కరెంట్ చార్జీలను పెంచాలంటే భయ పడేటువంటి పోరాటాన్ని వామ పక్షాలు చేయడం గర్వించ దగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్ర మంలో చనిపో యినటు వంటి విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాల స్వామికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సిపిఐ ఎంఎల్ నాయకులు పెద్దన్న, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, వలీ, ప్రకాష్, మసూదు, బాబు, ప్రసాద్, ముస్కిన్, వెంకటనారాయణ, రాజు, రామాంజి, ఇస్మాయిల్, కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులు అర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

### వడ్డెర్ల రాష్ట్ర రాజకీయాలతోపాటు ఆర్థికంగా బలపడాలి - రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్

గార్లదిన్నె, ఆగస్టు 28 ప్రభాతవార్త

గార్లదిన్నె రాష్ట్రంలో వడ్డెర్లు రాజకీయంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర వడ్డెర్ల సంఘం కన్వీనర్ వెంకట్ వడ్డెర్ల సంఘం ఉపాధ్యక్షులు వడ్డెర వన్నూరు మాట్లాడుతూ.. బత్తల పల్లిలో ఏర్పాటు చేసినటు వంటి వడ్డెర రాష్ట్ర సమావేశంలో అం దరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. సుదర్శన్ ఆనంద్ బాబు, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వడ్డెర రాష్ట్ర కన్వీనర్ వెంకట్

### జంబులదిన్నె చెరువు ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగప్ప

గార్లదిన్నె, ఆగస్టు 28 ప్రభాతవార్త

గార్లదిన్నె మండల పరిధిలోని జమ్మలదిన్నె గ్రామ అధ్యక్షులుగా నాగప్పను ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగింది. ఈ కార్య క్రమ ంకు అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య, ఆలూరిసాంబశివారెడ్డి, అనంత పురం మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ వై.నారాయ ణరెడ్డి, మం డల కన్వీనర్ నరేంద్రరెడ్డిలు ఆదివారం నారాయ ణరెడ్డి ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిసి నూతన ప్రెసిడెంట్ నాగప్పను ఘనంగా సత్కరించారు. అదే విధంగా నూతన ప్రెసిడెంట్‌గా ఎన్ని కైన నాగప్ప, వైఎస్ ఆర్‌సిపి నాయకులు హృదయ పూర్వక అభినం దనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగప్పను సన్మానిస్తున్న దృశ్యం

### ప్రణవ్ అబాకస్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త

నగరంలోని ప్రణవ్ అబాకస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఆది వారం తాడిపత్రిలో నిర్వహించిన 8వ రీజనల్ లెవెల్ అబాకస్, మెంటల్ అరిథమేటిక్ పోటీలో పాల్గొని ప్రతిభ చాటారు. 14 మంది విద్యార్థులు పాల్గొనగా ఒక రు ఛాంపియన్ ఆఫ్ ఛాంపి యన్, ఇద్దరు ఛాంపియన్, ఏడు గురు విన్నర్-1, ఇద్దరు విన్నర్- 2, ఇద్దరు విన్నర్-3గా నిలిచారు. ఈ సం దర్భంగా నిర్వహాకులు ఎన్.రుకేశ్‌రెడ్డి, విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులు, తమ పిల్లల మానసిక అభివృద్ధికి, ఏకాగ్రత, జ్ఞాపిక శక్తి పెరగ డానికి అబాకస్ ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న సెంటర్ అధ్యాపకులు

## వెంకటమ్మను ప్రభుత్వం ఆదుకోవాలి

### రూ,8వేలు ఆర్థిక సహాయం అందజేత

పామిడి, ఆగస్టు 28 ప్రభాతవార్త

ఏడాది క్రితం భర్తను కోల్పోయి రెండు కాళ్ళు పనిచేయక అనా రోగ్యంతో దయనీయ స్థితిలో జీవ నం సాగిస్తున్న మండల పరిధి లో ని పాళ్యంతాండాకు చెందిన వెంకటమ్మను ప్రభుత్వం ఆదుకో వాలని టిడిపి ఎస్టీ సెల్ పార్ల మె ంట్ అధ్యక్షులు గ్రామ మాజీ స ర్పంచ్ రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంకటమ్మను పరామర్శించిన రమేష్‌నాయక్ స్నేహితుల సహకారంతో ఆదివారం రూ,8 వేల ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు. ఆందోళన చెందవద్దు మేమంతా అండగా వుండి, అ దుకుంటామని వెంకటమ్మకు భరోసా కల్పించారు. ప్రజాసం క్షేమం రాప్ట్రాభి వృద్దే లక్ష్యమని ప్రకటిస్తున్న ప్రభుత్వం భర్తను కోల్పోయి రెండు కాళ్ళు పనిచేయక అనారో గ్యంతో దయనీయస్థితిలో జీవనం సాగిస్తున్న పాళ్యం తాండా వెంకటమ్మకు వెంటనే పెన్షన్ మంజూరుచేసి ఆమె జీవిత గమ్యానికి దారి చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున, సురేష్, అంజి, ముని, బాబు, నారా యణ, నాగేంద్ర, విష్ణు, ప్రకాష్, కేశవ, శంకర్, ఆదినారాణ, తదితరులు పాల్గొన్నారు.



వెంకటమ్మకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

### శ్రీ సుబ్రమ్మణ్యేశ్వర స్వామికి పంచామృతాభిషేకం

ఆత్మకూరు ఆగస్టు 28 ప్రభాతవార్త

మండల పరిధిలోని పంపనూరులో వెలసిన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందుల్లో భాగ ంగా స్వా మి వారికి పాలాభిషేకం, పంచామృ తాభిషేకం, అర్చన, మహానైవేద్యం నిర్వహించారు. కుజ దో ష, కాలసర్పదోష నివారణ కొరకు శ్రీ సుబ్ర మణ్యే శ్వరస్వామి మూల మంత్ర బీజాక్షర హో మం నిర్వహించడం జరిగింది. భక్తులు స్వామి వారి అభిషేకం, హోమం నందు పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

## కురుబ సాంస్కృతిక దర్శన ఆధ్వర్యంలో 13 గ్రంథాల విడుదల



కురుబ సాంస్కృతిక దర్శన కార్యక్రమంలో 13 గ్రంథాలను విడుదల చేస్తున్నప్పటి దృశ్యం

బళ్లారి, ఆగస్టు28, ప్రభాతవార్త ; నగరంలోని బీడీఏఏ సభా భవనంలో ఆదివారంనాడు కురుబ సాంస్కృతిక దర్శన సంస్థ ఆధ్వర్యంలో 13 గ్రంథాలను ఆవిష్కృతం చేశారు. కురుబ సాంస్కృతిక పరిషత్ అధ్యక్షుడు, మాజీ మంత్రి హెచ్.ఎం.రేవన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పరిశోధకుడు, అధ్యాపకుడు డా.బి.కె.రవి గ్రంథాలను విడుదల చేశారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఆయన కురుబ సంస్కృతి పట్ల సమాజానికి చెందిన ప్రతిఒక్కరు శ్రద్ధాశక్తులు కనబరచాలని, ఈ నేపథ్యంలో ఈ గ్రంథాలను సమాజానికి చెందిన ప్రజలు చదవాలని, తద్వారా సముదాయపు సాం స్కృ తిక పరంపరను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి హెచ్.ఎం.రేవన్న మాట్లాడుతూ ఎంతో వెనకబడి ఉన్న కురుబ సమాజం ప్రజలు ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లో నిలదొక్కుకుంటుండడం సంతోషదాయ కమని కురుబ సమాజానికి చెందిన పిల్లలు శైక్షణికంగా, ఉద్యోగపరంగా అభివృద్ధి చెందడంలేదని, అటువంటి వారిని గుర్తించే దిశలో సమాజం ప్రముఖులు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజికంగా, రాజకీయంగా సమాజం ప్రజలను జాగృతం చేయాలని, అభివృద్ధిబాటలో కురుబలు ముందంజలో ఉండేలా పోరాటం జరపాలని, ఈ కార్యానికి అందరి సహకారం అత్యావశ్యకమని, కురుబ సమాజానికి అవసరమైన రిజర్వేషన్ కేటాయింపుకై పోరాటానికి కూడా తాను సిద్ధమేనని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.ఎల్.స్వామి, హంపీ యూనివర్సిటీ అధ్యాపకుడు డా.చలువరాజ్, డా.హెచ్.టి.హాళ్లికేరి, కురుబ సంఘం అధ్యక్షుడు ఎర్రేగౌడ, బుడా మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, పరిషత్ రాష్ట్ర సభ్యుడు బెణకల్ బసవరాజగౌడ, నాయకులు కె.ఎ.రామలింగప్ప, కెరెకోడప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

### వాగరి వరదప్రవాహంలో చిక్కుకుని ఎద్దు మృతి.... రైతుకు ఎమ్మెల్యేచే ఆర్థిక సాయం



సిరుగుప్ప తాలుకా చాణక్యనూరు గ్రామంలో వాగరినదిలో కొట్టుకుపోయి మృతిచెందిన ఎద్దు




రైతుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప

బళ్లారి, ఆగస్టు28, ప్రభాతవార్త ; జిల్లాలోని సిరుగుప్ప తాలుకా చాణక్య నూరు గ్రామంలో భీరప్ప అనే రైతు తన రెండు ఎద్దులకు నీరు తాగిం చేందుకు సమీపంలో ఉన్న వాగరినదిలోకి వెళ్లగా హఠాత్తుగా ఉధృతంగా నదిలో వరదప్రవాహం పెరగడంతో రెండు ఎద్దులతో పాటు తాను కొట్టుకు పోయిన ఘటన జరిగింది. అయితే సమీపంలో ఉన్న రైతులు కొందరు ఈ దృశ్యాన్ని చూసి ప్రమాదంలో ఉన్న ఈరప్పను ఒక ఎద్దును కష్టపడి ఒడ్డుపైకి తీసుకొచ్చి రక్షించారు. మరొక ఎద్దును కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే ఎద్దు కొట్టుకుపోయి బురదలో చిక్కుకుని మృతిచెందింది. సమాచారం తెలు సుకున్న సిరుగుప్ప ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప హుటాహుటిన గ్రామా నికి చేరుకుని రైతు ఈరప్పను పరామర్శించారు. ఇదే సందర్భ ంలో ఈరప్పను కాపాడిన గ్రామస్తులను అభినందించారు. ఎద్దు కోల్పో యిన ఈరప్పకు తక్షణ ఆర్థికసాయంగా రూ.10 వేలు అందజేశారు. సిరుగుప్ప తహసీ ల్దార్‌కు ఫోన్ ద్వారా మాట్లాడుతూ రైతు ఈర ప్పకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సాయం అందేలా చూడా లని కోరారు. ఈ సందర్భంలో గ్రామ ప్రముఖులు రంగప్ప, రమేష్, చంద్ర, పక్కీరప్ప, సోమ శేఖర్‌గౌడ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలు బాబోయ్ దోమలు

### -దోమల సమస్యలతో బెంబేలెత్తి పోతున్న ప్రజలు - 9 నెలలుగా ఫాగింగ్ చర్యలు శూన్యం

రాప్తాడు, ఆగస్టు 28 ( ప్రభాతవార్త)

రాప్తాడు మండల కేంద్రంలో పారిశుద్ధ్య సమస్య లోపించడంతో దోమలు వ్యాప్తి చెంది దోమ కాటుకు గురై రోగాలు, విష జ్వరాలు భారీన పడు తు న్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సమస్యల రాకు ండా చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వచ్ఛ సంకల్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కానీ అధికారులు మాత్రం పారిశ ుద్ధ్య సమస్యపై దృష్టి సారించకుండా నిర్లక్ష్య దోరణి అవలంభిస్తు ండటం తోనే మురుగు కాలువల్లో మురుగునీరు, చెత్తా చెదారం పేరుకుపోయి దోమ లు వ్యాప్తి చెందుతు న్నాయి. పండగలకు..పై ఉన్నతాధికారులు మండల కేం ద్రంలోకి విచ్చేస్తు న్నారంటే అప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా మురుగు కాలు వలు శుభ్రం చేసి. బ్లీచింగ్ ఫౌడర్ చల్లిపోతారని స్థానిక ప్రజలు మండి పడు తున్నారు. రాప్తాడు మండలం మేజర్ పంచాయతీ అయినా మండల కేంద్ర ంలో పారిశుద్ధ్యం ఎక్కడి వేసిన గొగ్గళి అక్కడే అన్న చందంగా ఉంది. రోజు మండల కేంద్రానికి వస్తున్న అధికారులు చూసి చూడనట్లు వెళ్లి పోతు న్నారని ప్రజల ఆరోపిస్తున్నారు. సంబ ంధిత అధికారులు స్పందించి దోమలు వ్యాప్తి చెందకుండా మురు గునీటి కాలువలు శుభ్రం చేయించి ఫాగింగ్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అపరిశుభ్రతంగా చౌడమ్మ కట్ట వీధి, చింతమేకల వీధి

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా K.PADMAVATHI W/o K.VARADARAJULA REDDY, H.No: 3/706-15, YELLANURU ROAD, TADIPATRI, ATP నందు నివసిస్తున్నారు. తాడిపత్రి శ్రీరామ్ సిటీ యూనియన్ లిమిటెడ్ తాడిపత్రి బ్రాంచ్ వారు వీరి ప్రాపర్టీని తనఖా పెట్టుకొని రుణం ఇస్తున్నారు. సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి క్లైమ్‌లు, ఆక్షేపణలు ఉన్న ఎడల నేటి నుండి ఏడు రోజుల లోపు క్రింది చిరునామాకు సంప్రదించగలరు.

**SCHEDULE OF IMMOVABLE PROPERTY**

This Property : SY NO: 734, Total : 16.84 cents

The property is situates in YELLANURU ROAD Tadipatri(M) with the following particulars.

DOC NO : 5580/2022

East: Property in the same S.No. Belong to C.Krishna Boya, West: Plot No. 176(part) belong to N.Peddireddy & N.Niranjan Reddy, North: Applicants Smt K.Padmavathi purchased site, South: 18 feet wide Road

RAMESWARA REDDY
(Advocate), Ananthapur.

# సంక్షేమ పథకాలను గడపగడపకు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దే..

## - నగరాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్నాం - అర్బన్ ఎమ్మెల్యే అనంత



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత



వర్షంలోనే డ్రైనేజీ కాలువలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం సిటీ, ఆగస్టు 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమ పథకాలను గడపగడపకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 43, 44 డివిజన్ల పరిధిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పోరేటర్లు ఇషాక్, శాంతి సుధలతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అంచనాలు తయారు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అనంతపురం నగరాన్ని అభివృద్ధి బాటలో పయనింప జేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ప్రధాన రహ దారుల అభివృద్ధి దాదాపు పూర్తి చేశామని, అంతర్గత రహదారుల అబి. వృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. నగరంలో పారిశుద్ధ్య సమస్య తలెత్త కుండా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు డ్రైనేజీలను అభివృద్ధి చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఆ దిశగా నగరంలో తమ పాలక వర్గం కృషి చేస్తోందన్నారు. ప్రజలు కూడా గడపగడప కార్యక్రమంలో అపూర్వ ఆదరణ కనబరుస్తున్నారని, తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అంతకు ము ఉనుపు వర్షంలోనే నగరంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యటించి వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా వర్షపు నీరు మళ్లించే ప్రయత్నాలను దగ్గరు ఒడి చేయించారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయ భాస్కర్‌రెడ్డి లతో పాటు పలువురునేతలు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం అలవర్చుకోవాలి

## - అవినీతిలేని ధర్మపాలన భావిపౌరుల బాధ్యత - ఇస్కాన్ అధినేత శ్రీ సత్యనాథ్ ప్రభూజీ-టీడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలువ



ప్రతిభాఅవార్డుల మహోత్సవంలో ప్రసంగిస్తున్న ఇస్కాన్ అధినేత శ్రీ సత్యనాథ్ గోపీనాథ్ ప్రభూజీ



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం



మాజీ సర్పంచు పిఎస్ శర్మకూతురు గిరిజమ్మకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, అగస్టు 28 ప్రభాతవార్త

విద్యతో పాటు విద్యార్థులు చిన్నతనం నుండే వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలని, క్యారక్టర్ లేకపోతే ఎంత విద్యావంతుడైన సామాజిక బాధ్యత ఉండ దని, దేశంలో అవినీతిలేని ధర్మపాలన భావిభారత పౌరులు బాధ్యత వహించాలని ఇస్కాన్ సంస్థల అధినే శ్రీ సత్యనాథ్ గోపీనాథ్ ప్రభూజీ పేర్కొన్నారు. అదివారం ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డిఎన్ మూర్తి, కాంచనగంగల సంయుక్త అధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు ప్రతిభా అవా ర్డులు, స్వాతంత్ర్యోధ్యకారుల కుటుంభ సభ్యులకు సన్మానం, ప్రకృతి రక్షణలో మొక్కల పంపిణీ కార్యక్రమంలో చల్లా కిశోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనాథ్ ప్రభూజీ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవత్వం అంతరించిపోతోందని, పక్కవాడి గురించి అలో చించే మానవసంభంధాలు కరువౌతున్నాయని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించే బాధ్యతలను విస్మరిస్తున్నారని, అం దుకే వేగవం తమైన జీవితంలో అధ్యాత్మిక విలువలతో సామాజిక బాధ్యతతో ప్రతివ్యక్తి వ్యవహరించాల్సి న అవశ్యకత ఉందని, మహాభారతం, భగవద్గీ తలలోని విలువలను వివరించారు.

ఈ కార్యక్రమంలో వశిష్ట అతిథిగా పాల్గొన్న టిడిపి జిల్లా అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలువ శ్రీనివాసులు ప్రసం గిస్తూ కరువు జిల్లాలో ఎన్నో అర్థిక అటుపోట్లు ఎదుర్కొని పదవ తరగతి, ఇంటర్‌ల లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల్లో సామాజి కంగానే కాకుండా భవిష్యత్తుపై అవగాహన కల్గించడం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల్లో సామాజిక స్ఫృహా నింపుతుందన్నారు. విశ్రాంత అంధ్రాబ్యాంకు డిజిఎం జయప్రకాష్ మాట్లాడుతూ తాను ఉన్నత విద్యావం తుడాగా ఎదగడానికి చేసిన కృషి, సాధించిన బంగారు పతకాల వెనుక కృషి, జీవితం లో రాణించిన అంశాలను వివరిస్తూనే విద్య ద్వారానే జీవితంలో అనుకున్నతి సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న వంద సంవత్స రాల రుద్రప్ప మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్యోధయంలో పాలుపంచుకున్న అంశాలను వివరించారు. కార్య క్రమ నిర్వాహకులు డిఎన్ మూర్తి ప్రసంగిస్తూ విద్యకు కులం లేదని, అకలికి మతం లేదనినమ్ముతే అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాట్లు పేర్కొ న్నారు. పేదరికం విద్యకు అడ్డుకారా దని పేద విద్యార్థుల్లో కొందరిని దత్తత తీసుకుని విద్యాబుద్ధలు నేర్పిస్తున్న ట్లు తెలిపారు. నేడు ప్రతిభా అవార్డులు స్వీకరించిన ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నతంగా రాణించాలని అకాంక్షిం చారు. అలాగే ఎందరో త్యాగాలతో సిద్ధించిన స్వాతంత్రో ద్యమ స్ఫూర్తిని భావితరాలకు అవగాహన కల్పించేందుకే స్వాతంత్ర్యోధ్యయోదుల కుటుంభ సభ్యులను సన్మా నిస్తున్న ట్లు పేర్కొన్నారు. ప్రకృతిని రక్షించే భాధ్యతను గుర్తు చేసేం దుకు ప్రతిఒక్కరికి మొక్కను ఇచ్చి పెంచాలని సూచి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హనుమం తరాయచౌదరి, వాల్మీకి ఉద్యో గుల సంఘం నాయకులు వెంకటేశులు, విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తిప్పే స్వామి, తదితరులు పాల్గొ న్నారు. అనంతరం వందమందికి పైగా ధరఖాస్తు చేసు కున్ని ప్రతిభా వంతులైన విద్యార్థులను, వారి తల్లితండ్రులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించిన జ్ఞాపికలను అందజేసారు. అలాగే స్వాతంత్ర్యోమ యోధుల కుటుంభ్యులను కూడా దుశ్శాలువలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. అహ్వానితులకు మొక్కలను పం పిణీ చేసారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు అలపించిన గీతాలు అలరించాయి. అలోచింపచేసాయి.

# ఐకమత్యంతో ముందుకు వెళదాం

## రాజకయంగా, సామాజికంగా ఎదుగుదాం - భారీగా తరలివచ్చిన వడ్డెర్లు - వడ్డె వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెవెంకట్



క్రేన్ సహాయంతో పూలమాలలు వేస్తున్న దృశ్యం



భారీగా సదస్సుకు తరలివచ్చిన వడ్డెర సోదరులు

బత్తలపల్లి, ఆగష్టు 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో జీవిస్తున్న వడ్డెర్ల మందరం ఐకమత్యంతో ముందువెళ్లి రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా ఎదిగేందుకు పోరాడుదామని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్డె వెంకట్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాలులో వడ్డెర చైతన్య సదస్సు ను భారీ వడ్డెర సోదరుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు పూర్తయినా ఇంతవరకు వడ్డెర్లకు నిజమైన స్వాతంత్రం రాలేదన్నారు. నిత్యం ప్రాణాలతో చెలగాటమాడే రాళ్లుకొట్టే వృత్తిలోనే బతుకులు వెళ్లబెడుతున్నాం. మనం కట్టిన ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు చూసి గొప్పలు చెప్పే రాజకీయపార్టీ నాయకులు వాటి కట్టడం వెనుక వున్న మనకు మాత్రం రాజకీయ ప్రాముఖ్యత నివ్వక పోవడం విచారకరమన్నారు. వడ్డెర్లు ఎప్పటికి వెనుకబడి వుండేందుకు విద్య పరంగా, ఆర్థికంగా, చైతన్యవంతులుగా లేకపోవడమే ముఖ్యకారణ మన్నారు.

మన వెనకబాటు తనాన్ని పారదో లేందుకు మనపిల్లలను విద్యావంతులను చేద్దాం, చైతన్యవంతులయ్యి అందరి లాగే ఎదుగుదామని పిలుపనిచ్చారు. స్వాంతత్ర సమరయోదుడు, మన ఆశాజ్యోతి వడ్డె ఓబన్న స్ఫూర్తితో రాజకీయంగా ఎదిగేందుకు అడుగులు వేద్దామని, ఇందుకు మనమంతా ఐక్యంగా వుండడమే ప్రధానమన్నారు. రాష్ట్రంలో 40లక్షల మంది వడ్డెర కులస్థులు వున్నప్ప టకి మనకు ఇంతవ రకు చట్టసభల్లో చోటు దక్కకపోవడంతో మనము వెనుక బడి వున్నామ న్నారు. రాబోయే రోజులలో ఏ పార్టీ మనకులానికి టికెట్లు కేటాయిస్తుందో ఆ పార్టీతోనే వుండి మన విజయాన్ని ఎగురవేద్దా మన్నారు. మనలను అన్ని పార్టీలు ఓటుబ్యాంకుగానే చూస్తున్నాయే తప్పా, మనకు ప్రాధాన్యతను ఇచ్చి నడిపించిన పాపాన పోలేదన్నారు. మనవాళ్లు ప్రమాదకరమైన రాళ్లుకొట్టే వృత్తిలో వుండి ప్రాణా లు పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మనవారికి క్వారీలు కేటాయి ంచాలని, 45 సంవత్స రాలకే ఫించను సౌకర్య ం, భీమా వర్తింపజేయడం లాంటివి పోరాడి సాధించుకుం దామన్నారు. మన కులానికి సైతం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సీడీ పైన వడ్డెర యువకులకు లోను సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఐక్యతా సద స్సులు నిర్వహించడం వలన ప్రభుత్వాలలోనూ ఆలోచన వచ్చి మనకు కావాల్సి న సౌకర్యాలు కల్పించే అవకాశం వుందన్నారు. రాళ్ల కొట్టి, గోడలు కట్టి రాటుదేలిన చేతుల పిడికిలి బిగించి పోరాడుదామని, వడ్డెర్లు ఎదుర్కొ ంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి పోయేలా చేద్దామన్నారు. అంతకు ముందు మండలకేంద్రంలోని నాలుగు రోడ్లలోనూ బైకు ర్యాలి నిర్వహిం చారు. క్రేన్ సహాయంతో బారీ పూల దండను వడ్డె వెంకట్ మెడలో అలకరింపజేశారు. దారి పొడవునా కీలుగు ర్రాలు, మరగాళ్లు, డప్పుశబ్దాలు, పటాసుల పేళుళ్ల మధ్య వెంకట్‌ను సమావేశస్థలికి ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, అనంత పురం, శ్రీసత్యసాయి జిల్లా అధ్య క్షులు వన్నూరప్ప, పెద్దన్న, నార్శింపల్లి సర్పంచు నారాయణస్వామి, వెంకటన్న, మంజుల నాగరాజు, రమణయ్య, గోగుల బొజ్జప్ప, పెద్దన్న, ఆదెప్ప, వన్నూరప్ప, గోపాల్, శివయ్య, ముది గుబ్బ శ్రీనివాసులు, నారాయణస్వామి, ధర్మవరం రవి, లక్ష్మన్న, గోగుల వన్నూరప్ప, నెట్టికంట రమణ సత్తి, నారాయణ, ప్రతాప్, శ్రీనివాసులు, రాధాకృష్ణ, మల్లి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

## - ఎంఎల్‌సి ఇక్బాల్ - విన్నర్‌గా పుట్టపర్తి, రన్నర్‌గా చిలమత్తూరు

చిలమత్తూరు, ఆగష్టు 28 ప్రభాతవార్త

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలని హిందూపురం వైసిపి ఇన్‌చార్జ్, ఎంఎల్‌సి మహ మ్మద్ ఇక్బాల్, ఎస్‌ఐ శ్రీనివా సులు, స్థానిక వైసిపి నాయకులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ జగన్నాథరెడ్డిలు యువతకు పిలుపునిచ్చారు. జాతీయ ఆటల దినోత్స వం సందర్భంగా ఎంఎల్‌సి ఇక్బాల్ సహకారంతో స్పో ర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సాధికారత సంస్థ మరియు పాత్రికేయులు సంయుక్తంగా ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలను స్థానిక శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో ఎంఎల్‌సి అట్టహాసంగా ప్రారంభించారు. ఓపెన్ కాంపిటేషన్‌లో నాకౌట్ పద్దతిలో ప్రారంభమైన ఈ టోర్నీ ఫైనల్‌లో పుట్టపర్తి, చిలమత్తూరు జట్లు తలపడగా పుట్టపర్తి జట్టు టోర్నీ విజేతగా నిలవగా రన్నర్‌గా చిలమత్తూరు జట్టు, మూడవ స్థానంలో శ్రీరంగరాజుపల్లి జట్టు నిలిచాయి. గెలుపొందిన విన్నర్స్, రన్న ర్స్, మూడవ స్థానంలో నిలిచిన జట్లకు నిర్వాహకులతో పాటు ఎస్ఐ, వైసిపి నాయకుడు నాగరాజు చేతుల మీదుగా ట్రోఫీలతో పాటు నగదు అంద చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సంధ్య, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, జగన్, నరసిం హారెడ్డి, సిపిఎం ప్రవీణ్, పిడి రామాంజి నేయులు, అరబ్‌జాన్‌తో పాటు స్థానిక పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తున్న దృశ్యం

# నా పేరుపై విక్రయాలు నిర్వహిస్తే చర్యలు

## - పల్లపాడు కంబగిరిరెడ్డి

గుత్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలో పలు సర్వే నెంబర్లపై తనకు సంబంధం లేని భూములను చట్టవ్యతిరేకంగా విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పల్లపాడు కంబగిరిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికంగా వున్న ఆయన ప్రస్తుతం యాడికిలో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి శివారు ప్రాంతంలోని సర్వేనెంబర్ 412/1, 412/2లో 3.07 ఎకరాలపై తనకు ఎలాంటి హక్కు లేదన్నారు. అయితే కొంతమంది తన పేరిట ఆయా భూములు విక్రయించేందుకు యత్నిస్తున్నారని సమాచారం అందిందన్నారు. సదరు భూములపై తనకు, తన వారసులకు ఎలాంటి హక్కులు లేవని ఈ నేపథ ్యంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఆయా సర్వేనెంబర్లపై విక్రయాలకు తనకు ఎలాంటి సంబంధంలేదని ప్రకటనలో పేర్కొన్నారు.

# వైకాపా నాయకుడు శంకర్ రెడ్డి మృతి

## - నివాళులర్పించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



శంకర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తదితరులు

బుక్కపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త

మండల పరిధిలోని గశికవారిపల్లి పంఆచయతీ చింతలయ్య గారిపల్లికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకులు శంకర్ రెడ్డి(60) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పుట్టపర్తి శాసన సభ్యులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం శంకర్ రెడ్డి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంపిపి శ్రీధర్ రెడ్డి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ గోవింద రెడ్డి, అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ వెంకట చౌదరి, విజయరెడ్డి, చిరంజీవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బళ్లారిలో ఘనంగా రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్ జన్మదిన వేడుకలు



రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్ జన్మదినం శుభాకాంక్షలు తెలుపుతున్న అలివేలు సురేష్ తదితరులు

బళ్లారి, ఆగస్టు28, ప్రభాతవార్త ; నగరంలో రాజ్యసభ సభ్యుడు డా. సయ్యద్‌నాసీర్‌హుసేన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డా.సయ్య ద్‌నాసీర్‌హుసేన్‌ను కలిసి పూలమాలలతో పుష్పాంజలి సమర్పించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి పలుచోట్ల కార్పొరేటర్‌లు, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్ చురుగ్గా పాల్గొన్నారు. ఒక విధంగా కాంగ్రెస్ శ్రేణుల్లో డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్ జన్మదిన వేడుకలు ఉత్సాహం నింపిన ట్లయ్యింది. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో స్థానిక గురుఫం క్షన్‌హా లులో జరిగిన కార్యక్రమంలో వేలాది మంది కాంగ్రెస్‌కు చెందిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ఆయా తాలుకాల కా ంగ్రెస్ పార్టీ పదాది. కారులు పా ల్గొని డా.సయ్యద్‌నాసీర్‌హుసేన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం కనిపించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్‌రఫిక్, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.ఆంజనేయులు, మేయర్ ఎం.రాజేశ్వరి, కేపీసీసీ మీడియా ఇన్‌చార్జి వెంకటేష్‌హెగడే, కార్మికవిభాగం అధ్యక్షుడు అలివేలు సురేష్, నగర ప్రచారసమితి అధ్యక్షుడు బోయపాటి విష్ణు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుల, కుమారమ్మ, మల్లీశ్వరి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# మృతిచెందిన రైతుకుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పల్లె



రామచంద్ర భార్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

బుక్కపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త

మడల పరిధిలోని కొత్తకోట గ్రామంలో విద్యుత్ అఘాతానికి గురై మృతి చెందిన రైతు రామచంద్ర కుటుంబాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, ఇంటి పెద్ద మృతి చెందడం బాధాకరమని సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రూ.5000 ఆర్థిక సహాయం అందించి మృతుడి భార్య నరసమ్మ, కుమారుడు నాగరాజులను ఓదార్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీ మంత్రిని కలుసుకొని తమ సమస్యలు విన్నవించుకు న్నారు. అనంతరం గ్రామస్తులను పల్లె రఘునాథ్ రెడ్డి ఆప్యాయంగా పలుకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు.

# టీడీపీ పార్టీలోకి చేరికలు

## - కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పరిటాల సునీత, శ్రీరామ్‌లు



పార్టీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్



నూతనంగా పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్‌లు

రామగిరి, ఆగస్టు 28 ప్రభాతవార్త

ధర్మవరం నియోజకవర్గం వెంకటాపురంలో పట్టణంలో 25వ వార్డు నుంచి 15 కుటుంబాల వారు తెలుగు దేశం పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ధర్మవరం ఇన్‌చార్జ్ యువనాయకుడు పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్ వారికి తెలియజేస్తూ.. పార్టీలో కష్టపడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసే వరకు నిర్విరామంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు.

పార్టీలో చేరిన వారిలో ఆర్.రామచంద్ర, వై.సాయినాథ్, కె.గంగాధర్, బి.వినయ్, కిషోర్, జి.దుర్గాప్రసాద్, బి.చంద్ర, ఎస్.మాబాషా, సునీల్, నాగరాజు, సి.కిరాణసాయి, రాజు, గోపాల్, రామాంజి, బాషా తదితరులు ఉన్నారు.

# ఇళ్లు ఖాళీ చేయాలంటూ హెచ్ఎల్‌సీ అధికారుల నోటీసులు

## - జిల్లా మంత్రికి మొరపెట్టుకున్న బాధితులు

## - కొలగల్లు గ్రామంలో మంత్రిని చుట్టుముట్టిన గ్రామస్తులు

బళ్లారి, ఆగస్టు28, ప్రభాతవార్త ; తాలుకాలోని కొలగల్ గ్రామం మీదుగా ప్రవహించే తుంగభద్ర హెచ్ఎల్‌సీ ఉప కాలువ గట్లపై ఇరువైపులా నిర్మించుకున్న ఇళ్లు, గుడిసెలను ఖాళీ చేయాలంటూ హెచ్ఎల్‌సీ అధికారులు తమకు నోటీసులు పంపారని, యేళ్ల తరబడి నివాసం చేసుకుని ఉంటున్న తమకు దారి ఏది అని వందలాది మంది ప్రజలు జిల్లా మంత్రి బి.శ్రీరాములకు మొర పెట్టుకున్నారు. ఆదివారంనాడు గ్రామాన్ని సందర్శించిన మంత్రి శ్రీరాములుకు పలువురు బాధితులు నీరావరిశాఖ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయాన్ని తెలిపారు. కాలువపై ఇళ్లు నిర్మించుకుని ఎన్నో సంవత్సరాలు గడిచాయని, ఉన్నఫలంగా హెచ్ఎల్‌సీ అధికారులు కాలువ గట్లపై రోడ్డు నిర్మించాలని, ఇళ్లు ఖాళీ చేయకపోతే కూల్చివేస్తామని హెచ్ఎల్‌సీ అధికారులు నోటీసులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేయగా, అందుకు స్పందించిన శ్రీరాములు తహసీల్దార్ విశ్వనాథ్‌తో సమాలోచనలు జరిపి అనంతరం గ్రామస్తుల సభ జరిపారు. ప్రస్తుతం ఇళ్లను ఖాళీ చేయకుండా ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేలా నీరావరి అధికారులకు తాను తెలియపరుస్తానని, అలాగే సంబంధిత భారీ నీరావరి శాఖ మ ంత్రితో తాను మాట్లాడతానని, ప్రస్తుతం ఎటువంటి ఆందోళన చెందనవసరంలేదని హామీ ఇచ్చారు. అయినా పక్కా ఇళ్లు నిర్మించేందుకు వీలుగా గ్రామంలోనే మరోచోట కొంత భూమిని సేకరించే కార్యం చేపట్టాలని తహసీల్దార్‌కు మంత్రి చేపట్టారు. అంతవరకు ప్రస్తుతం ఉంటున్న ఇళ్లలోనే ఉండాలని మంత్రి వారికి హామీ ఇచ్చారు.



కొలగల్లు గ్రామంలో బాధితులతో మాట్లాడుతున్న జిల్లా మంత్రి బి.శ్రీరాములు